క్లుప్తంగా

నేటి నుంచి ఆరాధన ఉత్సవాలు


శివభక్తేంద్రాలయం

ఖాజీపేట: భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా శివ భక్రేంద్రుడు ప్రసిద్ధి పొందారు. ఈ ఆలయాన్ని ఎంతోమంది సినీ ప్రముఖులు సందర్శించారు. ఖాజీపేట మండలం పుల్లూరు పంచాయతీ సమీపంలోని పీడబ్ల్యూసీ బంగ్లా వద్ద ఆలయం వెలసింది. ఈ ఆలయం 30వ వార్షికోత్సవాలు ఈనెల 24 వతేదీ నుంచి జరగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


బీఎల్ఓతో మాట్లాడుతున్న ఈఆర్ఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులు శనివారం మండల పరిధిలోని 14 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ విషయంపై తహసీల్దార్ గంగయ్యతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబు, సర్వే ఇన్‌స్పెక్టర్ సానా మునిస్వామి, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీపీఎం మండల కన్వీనర్‌గా రమణయ్య

అట్లూరు: మండల కేంద్రమైన అట్లూరులో శనివారం నిర్వహించిన సీపీఎం ప్రథమ మండల మహాసభలో మండల కన్వీనర్‌గా ఇరగదిండ్ల రమణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు జి.శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేషలు తెలిపారు. గంగయ్య, దుర్గమ్మ, ప్రశాంత్, స్వప్నలతో పాటు మరొకరిని కో ఆప్షన్ సభ్యులుగా 7 మందితో మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

రేపు చాపాడులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

చాపాడు: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాకుమారి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండల కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. మండలంలోని ప్రజలు, రైతులు ప్రభుత్వ పరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

పంటలకు బీమా రక్షణ కవచం లాంటిది

బ్రహ్మంగారిమఠం: మండలంలో సాగు చేసిన పంటలకు ఆయా రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రబీ పంటకు బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బీమాను రైతులు డిసెంబర్ 15 లోపు చేసుకోవాలన్నారు. రైతు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్కు , రైతు భూమి పాస్ బుక్కులు తీసుకొని వెళ్లాలన్నారు.

ఎస్టీయూ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : ఎస్టీయూ 78వ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పుల్లయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం కడపలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో సమావేశం జరుగుతుందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. విద్యా సమస్యలు, జీఓ 117, పెండింగ్ బకాయిలు, పీఆర్సీ తదితర సమస్యలపై సమావేశంలో చర్చిస్తారన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పుల్లయ్య కోరారు.

నీటి సంఘం ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి


నీటి సంఘం శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాకుమారి

చాపాడు: త్వరలో జరగనున్న నీటి సంఘం ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రమాకుమారి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద శనివారం నీటి సంఘం ఎన్నికలకు సంబంధించిన ఏపీ, ఏపీఓలు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిసెంబరు 8న మండలంలో నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే విడుదలవుతుందన్నారు. చాపాడు మండలం కేసీ కెనాల్ పరిధిలో 12 టీసీ మెంబర్‌లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నిక ప్రక్రియ పూర్తిగా సాధారణ విధానంలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు శివ, మహేష్, మండల అధికారులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం నాగనాథేశ్వరుడు

- రేపు నాలుగో కార్తీక సోమవారం
- పూజలకు ఏర్పాట్లు పూర్తి


నాగనాథేశ్వరుడి ఆలయం (ఇన్‌సెట్) నాగనాథేశ్వరుడు

ఖాజీపేట: చుట్టూ పచ్చని చెట్లు.. భూమికి పచ్చని తివాచీ పరిచినట్లుగా కనిపించే పంట పొలాలు.. కాలుష్యం లేని ఆహ్లాదకర వాతావరణం.. పెద్ద ఎత్తున ఉన్న అందమైన కొండలు.. ఇంతటి సుందరమైన ప్రాంతంలో నాగనాథేశ్వర స్వామి ఆలయం ఉంది. భక్తుల కొంగు బంగారం.. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తుల హృదయాల్లో కొలువైన నాగనాథేశ్వరుడి ఆలయం ఖాజీపేట నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. కొండ పైభాగాన నాగనాథేశ్వరుని రూపంలో పరమశివుడు కొలువై ఉన్నాడు.

రుషులకు నిలయం నేలమాలిగ

పూర్వం రుషులు కొండ పైభాగాన ఉన్న నేలమాలిగలో కూర్చుని తపస్సు చేసుకునేవారు. ఇక్కడ ప్రశాంత వాతావరణం ఉండడం వల్ల ఇప్పటికీ సాధువులకు నిలయంగా ఉంటోంది. నేల మాలిగ నుంచి పెద్ద సొరంగం ఉండేదని, కాలక్రమేణా అది పూడిపోయిందని పెద్దలు చెబుతున్నారు.

బౌద్ధమత ఆనవాళ్లు..

కొండపైన బౌద్ధ మతానికి చెందిన ఆనవాళ్లు పరిశోధనలో బయట పడ్డాయి. బౌద్ధ మతానికి చెందిన వారు ఇక్కడ నివాసం ఉండినట్లు చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. వాటికి సంబంధించిన ఆనవాళ్లను మ్యూజియంలో భద్రపరిచినట్లు పేర్కొంటున్నారు.

ఆలయ అభివృద్ధిలో భక్తులదే కీలక పాత్ర

ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో భక్తులదే కీలక పాత్ర. ప్రతి భక్తుడు తన కోరిక నెరవేరిన తర్వాత మొక్కుబడి తీర్చుకుంటూ ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర వహించారు. రావులపల్లెకు చెందిన గంగవరం రామిరెడ్డి ఆధ్వర్యంలో కొండ దిగువన, కొండపైన కొంత మేరకు అభివృద్ధి జరిగింది. తర్వాత భక్తుల సౌకర్యం కోసం దువ్వూరుకు చెందిన గుమ్మా లక్ష్మిరెడ్డి సుమారు రూ.20 లక్షల సొంత నిధులతో కొండపైకి వాహనాలు వెళ్లేందుకు ప్రత్యేక రహదారి నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చొరవతో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

బండలాగుడు పోటీలు

కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.40,000, రెండవ బహుమతి రూ.30,000, మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు, ఐదో బహుమతి రూ.5వేలుగా నిర్ణయించారు.

50 ఏళ్లుగా అన్నదానం

ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రతి సోమవారం రోజున దాతలు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఖాజీపేటలోని ఆర్యవైశ్యులు గత 50 ఏళ్లుగా ఇక్కడ అన్నదానం చేస్తున్నారు. 1974లో తొలుత వల్లంకొండు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అన్నసత్రం ఏర్పాటు చేశారు. అన్నదానం ప్రారంభించి 50 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా సుమారు కోటి రూపాయలతో ప్రత్యేక అన్నసత్రం ఆర్యవైశ్యులు నిర్మిస్తున్నారు.

స్వయంభువుగా వెలసిన నాగనాథేశ్వరుడు

కొండల్లో నాగనాథేశ్వరుడు స్వయంభువుగా వెలిశాడు. పూర్వం కొండపైన గొర్రెల కాపరులు తిరుగుతుండగా శివుని లింగాన్ని గుర్తించారు. అప్పటి నుంచి పూజలు చేయడం మొదలు పెట్టారు. భక్తులు క్రమేణే నాగనాథేశ్వరుడిని దర్శించడం మొదలైంది. భక్తులు తమకు తోచిన విధంగా చందాల రూపంలో డబ్బులు వసూలు చేసి గర్భగుడి నిర్మించారు. అక్కడే పార్వతీ దేవి అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఆ తర్వాత ఒక్కో తాపను నిర్మించుకుంటూ నేడు పూర్తి స్థాయిలో ఆలయం వెలిసింది.

కార్మిక శంఖారావాన్ని జయప్రదం చేయండి


కార్మిక శంఖారావం కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

బద్వేలు అర్బన్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న జరిగే కార్మిక శంఖారావాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబులు తెలిపారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద కార్మిక శంఖారావానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సర్వసంపదల సృష్టకర్తలైన కార్మికులను, ప్రజలకు తిండిపెట్టే రైతాంగాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని అన్నారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న బ్రిటిష్ కాలం నాటి 44 రకాల కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా పని చేయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని అన్నారు. కార్మిక శంఖారావంలో భాగంగా ఈ నెల 26వ తేదీన బద్వేలు ఆర్డీఓ కార్యాలయం ఎదుట మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు నరసింహ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

పోరుమామిళ్ల: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కాలయాపన చేయకుండా, మౌనం వీడి ప్రభుత్వం పరిష్కారంపట్ల దృష్టి సారించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి, సీపీఎస్ కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం కోరారు. శనివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో రీజనల్ కన్వీనర్ క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 11 వ వేతన సవరణ గడువు ముగిసి 15 నెలలు అవుతున్నా 12వ వేతన సవరణ ఊసే లేకుండా పోయిందన్నారు. ఉద్యోగుల గోడు వినకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సబబా? అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలవుతున్నా ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై నోరు మెదపడం లేదన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్‌ఐసీ లోన్లు, సరెండర్‌లీవ్ బిల్లులు సుమారు రూ.30 వేల కోట్లు బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీపీఎస్ రద్దు గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఆరోగ్య సంరక్షణ పథకం అమలు కావడం లేదన్నారు. వైద్యఖర్చుల కొరకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. వంట ఏజెన్సీలకు గౌరవ వేతనాలు, వంట చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి


నమూనాలు ప్రదర్శించి, వివరిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని రవీంద్ర హైస్కూల్ వ్యవస్థాపకుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులతో ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించేందుకు, పారిశ్రామిక నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. 4 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు రూపొందించిన ఇటుకలు, సిమెంట్, సెంటు, సబ్బులు, బిస్కెట్స్, చాక్లెట్స్, దూప్‌స్టిక్స్, అగరబత్తీలు, నెయిల్ పాలిష్, పేపర్ రీ సైక్లింగ్ తదితర 139 నమూనాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా ఈ నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పల్లేటి విష్ణుకుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌వలి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను గ్రామంలోనే ఏర్పాటు చేయాలి


మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెన్నంపల్లె గ్రామస్తులు

బద్వేలు అర్బన్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేసిన చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాలను తల్లిదండ్రుల కోరిక మేరకు గ్రామంలోనే ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరురోడ్డులోని మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో చెన్నంపల్లె గ్రామస్తులు చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో 1958లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించడం జరిగిందని, అయితే గ్రామస్తుల కోరిక మేరకు నూతన పాఠశాల భవనాన్ని గ్రామంలోనే ఏర్పాటు చేసి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 64 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారని, గ్రామంలో కాకుండా దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వలన ఇబ్బందులు పడాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. చెన్నంపల్లె గ్రామంలో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మరుగుదొడ్డి స్థలంలో పాఠశాల భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారని, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, చెన్నయ్య, శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ చేయిస్తేనే పంటల బీమా


వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న

మైదుకూరు: ఈ–క్రాప్ చేయిస్తేనే రైతులకు పంటల బీమా వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. పంటల బీమాకు సంబంధించిన వివరాలను ఆమె శనివారం విలేకరులకు తెలిపారు. ఆ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రైతు సేవా కేంద్రాల్లో ఈ–క్రాప్‌కు సంబంధించిన వివరాలను అందజేసి క్రాప్ షోన్ సర్టిఫికెట్ తీసుకోవాలి. లోన్ తీసుకున్న రైతులు దానిని రెన్యువల్ చేయించుకుంటే పంటల బీమా ప్రీమియం చెల్లించవచ్చు. లోన్ తీసుకోని వారు నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పంటల బీమాకు దరఖాస్తు చేసుకునే రైతులు వన్‌బీ అడంగల్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, ఫోన్ నంబర్, క్రాప్ షోన్ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుంది. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డును అందజేయాలి. దరఖాస్తు చేసుకోవడానికి వరి పంటకు డిసెంబర్ 31, మిగిలిన పంటలకు డిసెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉందని ఏఓ వివరించారు.

శివాలయం కుంటను కాపాడాలి


దేవదాయశాఖ ఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్: పట్టణంలోని శివాలయం గుడి సమీపంలోని కుంటను ఆక్రమించి పునాదులు నిర్మిస్తున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుని కుంటను కాపాడాలని సీపీఎం పట్టణ నాయకులు చిన్ని తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాలయం సమీపంలోని కుంటను ఆక్రమించి యథేచ్ఛగా పునాదులు నిర్మించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా వారిపైన ఇరిగేషన్ అధికారులు గాని, మున్సిపల్, దేవదాయశాఖ అధికారులు గాని చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివాలయం కుంట ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్: డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది, మున్సిపాలిటీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు, వంకపోరంబోకు భూములు, హౌసింగ్ లేఅవుట్‌లలోని ఓపెన్ స్పేస్‌లను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ స్థలాలు, కుంట, చెరువు, పోరంబోకు స్థలాలు కబ్జాకు గురికాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతంలో సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే డ్రైనేజీలను ఆక్రమించడం, డ్రైనేజీలపై ముందుకు రేకులు వేసుకోవడం వంటి చేయరాదన్నారు. సమావేశంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవస్వామి జయంతి


అన్న ప్రసాదం వడ్డిస్తున్న శ్రీనివాసులస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో శనివారం మహాకాలాష్టమి సందర్భంగా కాలభైరవ స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. కాలభైరవస్వామి చిత్రపటానికి, విగ్రహానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి పూలతో అలంకరించారు. కాలభైరవస్వామి ఉపాసకులు శ్రీనివాసులస్వామి ఆధ్వర్యంలో 2 వేల మందికిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. అలాగే 2 వేల మంది భక్తులకు పంచముఖి రుద్రాక్షలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు సాయిబాబా చక్రపాణి, పెద్ద మల్లికార్జున, చంటి, మల్లి తదితరులు పాల్గొన్నారు.


పార్వతీదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

వెల్లాలలో ప్రత్యేక పూజలు

రాజుపాళెం: కార్తిక మాసం మూడో శనివారం పురస్కరించుకుని వెల్లాలలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి, పార్వతీదేవికి ఆలయ అర్చకులు వెంకటాచలపతి ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బిందెసేవ


బిందె సేవలో ఆలయాల నిర్వాహకులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రామేశ్వరం, దొరసానిపల్లెరోడ్డులోని శ్రీ భద్రావతి భావన్నారాయణ స్వామి ఆలయాల్లో స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఘనంగా బిందెసేవ నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేశారు. రామేశ్వరం భద్రావతి భావన్నారాయణస్వామి ఆలయం వారు హనుమత్ లింగేశ్వర స్వామి ఆలయం నుంచి, దొరసానిపల్లె ఆలయ నిర్వాహకులు శివాలయం నుంచి బిందె సేవను ప్రారంభించారు. స్వామి, అమ్మవారి నామస్మరణలతో వేడుకగా బిందెసేవ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో డప్పువాయిద్యాల సందడి, కళాబృందాల ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దారి వెంట భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

రోడ్ల నిర్మాణానికి పోటాపోటీగా టెండర్లు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని రెండు ప్రధాన రోడ్ల నిర్మాణానికి ముగ్గురు ప్రముఖ నేతలు పోటా పోటీగా టెండర్లు దాఖలు చేశారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఈ రోడ్ల నిర్మాణానికి రూ.11 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని చిన్నశెట్టిపల్లె నుంచి గాదెగూడూరు వరకు వయా రాజుపాళెం, అయ్యవారుపల్లె మీదుగా రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.626.55 లక్షలతో టెండర్లు పిలిచారు. అలాగే ఈ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వర్గీయులు, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వర్గీయులతోపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పోటాపోటీగా టెండర్లు దాఖలు చేశారు. రాజుపాళెం మండల పరిధిలోని పొట్టిపాడు నుండి ప్రొద్దుటూరు – చాగలమర్రి రోడ్డు వరకు, అర్కటవేముల, కుమ్మరపల్లె మీదుగా రోడ్డు నిర్మించేందుకు రూ.492 లక్షలతో టెండర్లు జరిగాయి. శుక్రవారం పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో టెండర్లు దాఖలు చేశారు. త్వరలో టెండర్లను ఓపెన్ చేయాల్సి ఉంది. ఈ పనులకు గాను ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వర్గీయులతోపాటు టీడీపీ ఇన్‌చార్జి వర్గీయులు కలిపి మొత్తం 3 టెండర్లు దాఖలు చేసినట్లు తెలిసింది.

లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపొద్దు


విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం: లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపడం నేరమని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని శ్రీ చైతన్య స్కూల్‌లో ట్రాఫిక్ నిబంధనల్లో భాగంగా శనివారం హెడ్‌మాస్టర్ రహంతుల్లా ఆధ్వర్యంలో 'సేవ్ ఆన్ రోడ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాత వాహనం నడపడం నేర్చుకొని లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడిపితే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగవని చెప్పారు. పాఠశాల విద్యార్థులు స్కూటీలు, బైక్‌లు నడపరాదని సూచించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ నారాయణ నాయక్, ఏఓ కరిముల్లా, శ్రీచైతన్యస్కూల్ ఏజీఎం నాగిరెడ్డి, డీన్ పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ


నిరాశ్రయులకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

చాపాడు/మైదుకూరు: మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో ఉన్న నిరాశ్రయులు, సాధువులకు అలాగే మైదుకూరు బస్టాండులో ఉన్న నిరాశ్రయులకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేకానంద సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా అభాగ్యులకు తోడ్పాటు అందించేందుకు తమ సంస్థ తరపున దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, నరసింహా, విజయ్, వెంకట్ సురేష్, పెద్దిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ


వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శనివారం పరిశీలించారు. జ్యోతుల ఉత్సవాలు నిర్వహించే సూపర్ బజార్ రోడ్డులోని చౌడమ్మ ఆలయం, దొరసానిపల్లె రోడ్డులోని భావనారుషి దేవాలయం, రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చౌడమ్మ దేవాలయాలను కమిషనర్ పరిశీలించి శానిటేషన్, వీధి దీపాల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిన్నా రోడ్డులో కాలువలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులచే తొలగింపజేశారు. అర్చన హోల్ పక్కన ఉన్న ప్రధాన కాలువలో పూడికతీత పనులను పర్యవేక్షించారు. ఇక్కడ కాలువ ఆక్రమణకు గురైందని, ఆక్రమణలను తొలగించాలని కమిషనర్‌ను ప్రజలు కోరారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వి.సుబ్బరాయుడు, ఎస్.నూర్ బాషా, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజారత్నం

బద్వేలు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని హౌసింగ్ లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజారత్నం తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయ సహా భవనంలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన 2.0 స్కీంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలని, అందుకు అవసరమైతే మెప్మా ద్వారా అదనపు రుణం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే సొంత ఇల్లు లేని వారు, గతంలో హౌసింగ్ లేఅవుట్‌లో స్థలం వచ్చి ఇళ్లు మంజూరు కాని వారు ఈ నెల 30వ తేదీలోపు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని, సకాలంలో ఇళ్లు పూర్తికాకపోతే నిధులు వెనక్కిపోయే అవకాశం ఉందని, ఆ విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, హౌసింగ్ డీఈఈ వెంకటసుబ్బయ్య, ఏఈలు, సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.